ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 30 డిసెంబరు 2024


చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ (పాతచిత్రం)



కూటమి.. క్లీన్ స్వీప్


ఎన్నికల నామ సంవత్సరంగా 2024

2024.. ఎన్నికల సందడితో ప్రారంభమవగా ప్రజా తీర్పుతో జిల్లాలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. నాలుగున్నరేళ్లపాటు వివిధ సమస్యలపై అధికార వైసీపీపై అలుపెరగని పోరాటం చేసిన విపక్షాలు ఎన్నికల వేళ తీర్పును కోరుతూ ప్రజల ముందుకు వెళ్లిన ఘట్టానికి 2024 సాక్ష్యంగా నిలిచింది. కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీలతో విజయ దుందుభి మోగించారు. కక్ష సాధింపులు.. కేసులు.. నిర్బంధాలు.. అమరావతి నిర్వీర్యం.. తదితరాలతో విసిగివేసారిన ఓటర్లు వైసీపీ ఫ్యాన్ రెక్కలను విరిచేశారు. ఇక ముందెన్నడూ ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా పరిపాలన సాగించాలంటే భయపడి పోయేలా ఓటర్లు తీర్పు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైసీపీపై ఎంతటి ఆదరణ చూపారో అంతకంటే అధికంగా 2024 ఎన్నికల్లో వ్యతిరేకించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా తీర్పు కోరగా.. అదే స్థాయిలో ఓటర్లు కూడా కలిసికట్టుగా ఎక్కడా ఓటు చీలిపోకుండా కూటమి అభ్యర్థులపై అభిమానం చూపి ఓట్ల వర్షం కురిపించారు. రాజధాని అమరావతి కేంద్రంగా ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయం అందరూ ఊహించినదే అయినా మెజార్టీలను చూసి నేతలే ఆశ్చర్యపోయేలా ఓటర్లు తీర్పు చెప్పారు. తమని ఐదేళ్లపాటు నరకయాతనకు గురి చేసిన అప్పటి అధికార పార్టీని మట్టుబెట్టాలని ఓటర్లంతా కలిసికట్టుగా నిర్ణయించుకుని మరీ ఓట్లు వేయడం విశేషం.

- లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలన్నింటా విజయదుందుభి
- నామరూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోయిన వైసీపీ
- బొప్పూడిలో ఎన్నికల ప్రచార సభకు ప్రధాని మోదీ హాజరు
- పోలింగ్ రోజున గుంటూరు, బాపట్లలో ప్రశాంతం.. పల్నాడులో రణరంగం

రికార్డు మెజార్టీలు..

మంగళగిరిలో వైసీపీ ఓటుకు రూ.4 వేలు పంచి పెట్టినా నారా లోకేశ్ 90 వేల పైచిలుకు మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చరిత్రలో ఇదొక రికార్డుగా నిలిచింది. గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి గతంలో ఏ ఎంపీకి రానంత మెజార్టీ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి 3 లక్షల 44 వేల పైచిలుకు వచ్చింది. అలానే గుంటూరు పశ్చిమ నుంచి బరిలో నిలిచిన గళ్లా మాధవికి 55 వేల ఓట్ల మెజార్టీ లభించింది. గత 20 ఏళ్ల నుంచి టీడీపీ గెలుచుకోలేకపోయిన గుంటూరు తూర్పులో నసీర్ అహ్మద్, నరసరావుపేటలో చదలవాడ అరవిందబాబు, మాచర్లలో బ్రహ్మారెడ్డి, బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ, మంగళగిరిలో నారా లోకేశ్ భారీ మెజార్టీలతో గెలుపొందారు. కూటమికి కేటాయించిన తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్ మంచి మెజార్టీతో విజయం సాధించారు. లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), టీ కృష్ణప్రసాద్(బాపట్ల) కూడా భారీ మెజార్టీలతో గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు.



నరసరావుపేట, గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు రాజకీయ చరిత్రలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. అన్ని వర్గాలు ఏకమై వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా పని చేశాయి. భారీ ఓట్ల ఆధిక్యంతో టీడీపీ కూటమి నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించి వైసీపీకి చెంప చెళ్లుమనిపించారు. పోలింగ్ రోజున వైసీపీ అరాచకాలను అడ్డుకునేందుకు ప్రజలే తిరగబడ్డారంటే ఎంతగా వారిలో ఆ పార్టీపై ఆగ్రహం గూడుకట్టుకుందో అంచనాకు రావొచ్చు. గొడ్డలి వేటులను సైతం మహిళలు ఎదుర్కోవడం, ఓటరు మీద దాడికి దిగిన ఒక ఎమ్మెల్యే చంప పగలగొట్టడం వంటి అనేక ఓటర్లను చైతన్యపరిచే సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల సంవత్సరంగా 2024 ప్రారంభమైంది. అప్పటికే ఓటరు జాబితాల్లో కూటమి సానుభూతిపరుల ఓట్లను భారీ సంఖ్యలో తొలగించేందుకు వైసీపీ చేసిన ప్రయత్నాలను కూటమి నేతలు అడ్డుకున్నారు. జనవరి నుంచే ఎన్నికల వాతావరణం పూర్తిగా జిల్లాలో వచ్చేసింది. అన్ని పార్టీల నేతల పర్యటనలు, బహిరంగ సభలు, రోడ్డు షోలతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల కోడ్ ప్రకటించిన వారంలోనే ప్రధాని నరేంద్రమోదీ ప్రచారానికి పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, మూడు పార్టీల

(మిగతా 7వ పేజీలో)

2024 రాజకీయ ముఖచిత్రం

వైసీపీ.. కకావికలం

వైసీపీకి రాజకీయంగా చేదు గుళికలను మిగిల్చిన ఏడాదిగా 2024ను చెప్పవచ్చు. మూడు జిల్లాల పరిధిలోని 20 అసెంబ్లీ స్థానాల, మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో దారుణ పరాజయం చవిచూసింది. దీంతో పాటు రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలన్నీ వికటించి అంతర్గత కుమ్ములాటలకు కారణమయ్యాయి. ఫలితాల తర్వాత వైసీపీ పరిస్థితి మూడు జిల్లాల్లోనూ మరింత దిగజారింది. ఎన్నికల ముందు వరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పార్టీ పదవితో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేసి సైకిలెక్కారు. ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా పార్టీని వీడారు. ఈ పరిణామా లన్నీ కూడా వైసీపీని రాజకీయంగా కోలుకోలేని విధంగా చేశాయి.





విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సందడిగా.. బాలోత్సవం

విజేతలకు పురస్కారాల ప్రదానం

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాల సందడి.. విద్యార్థుల కేరింతల మధ్య ఆదివారం పల్నాడు బాలోత్సవం ముగిసింది. విద్యార్థులు తమలోని సృజనాత్మకతను వెలికితీసి, వివిధ కార్యక్రమాల ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్నారుల ప్రదర్శన లతో అబ్బురపరిచారు. పట్టణంలోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాల వేదికగా బాలోత్సవం సందడిగా ఆదివారంతో ముగి సింది. రెండో రోజు పోటీలకు వచ్చిన విద్యార్థులు, తిలకించేందుకు వచ్చిన వారితో కళాశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పలు వేదికలపై విద్యార్థులకు శాస్త్రీయ నృత్యాలు, లఘు నాటికలు, జానపద నృత్యం, కోలాటం, దేశభక్తి పాటలు, విచిత్రవేషధారణలు, బుర్రకథలు తదితర అంశాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్ర మంలో కొత్తగూడెం, అమరావతి బాలోత్సవాల అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్, డాక్టర్ రామరాజు, రచయిత కాంతారావు, పల్నాడు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వర రావు, గౌరవాధ్యక్షుడు ఎమ్మెస్‌ఆర్కే ప్రసాదరావు, కోశాధికారి కోయా రామా రావు, సభ్యులు ఏ.భాగేశ్వరీదేవి, లక్ష్మీశ్వరరెడ్డి, గౌస్ మొహిద్దీన్, సాంబశివ రావు, బాలాజీ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కామినేని రామారావు, షేక్ మస్తాన్‌వలి, ఆంజనేయనాయక్, డి.శివకుమారి, ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మధ్యాహ్న భోజనం పథకాన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. నూతన సంవత్సరం సందర్భంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గత టీడీపీ ప్రభుత్వం 2019 వరకు అమలు చేసిన పథకాన్ని మళ్లీ పునరుద్ధరించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 21 జూనియర్ కళాశాలలు, అద్దంకి, చీరాల, పర్చూరు పరిధిలోని నాలుగు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 25 కళాశాలల్లోని సుమారు 11 వేల మందికిపైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని జనవరి 3 నుంచి అమలు చేయనున్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పల్నాడు జిల్లాలోని తొమ్మిది కళాశాలల్లోని 1,510 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. అలాగే గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు కూడా లబ్ధి చేకూరనుండటంతో తల్లిదండ్రులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలేజీల్లోనూ.. మధ్యాహ్న భోజనం

- జూనియర్ కళాశాల విద్యార్థులకు తీపికబురు
- పథకాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం
- 3 నుంచి అమలుకు విద్యాశాఖ అధికారుల ఏర్పాట్లు
- గుంటూరు, బాపట్ల, పల్నాడులోని 25 కళాశాలల్లో అమలు


సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని గత టీడీపీ ప్రభుత్వం అమలు చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే ఉంటారని భావించిన నాటి టీడీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మాదిరిగానే మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసింది. పైగా మండల కేంద్రాల్లో ఉండే కళాశాలలకు సుదూరంగా ఉండే గ్రామాల నుంచి ఉదయం 7 గంటలకే ఇళ్ల నుంచి విద్యార్థులు బయలుదేరుతుంటారు. చాలా గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేక సైకిళ్లపైనే

(మిగతా 7వ పేజీలో)

చాంబర్ ఎన్నికల్లో యేల్చూరి ప్యానల్ ఘన విజయం

- 180 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- తెల్లవారు జామున 3 గంటల తరువాత ఫలితాలు ప్రకటన

హోంగార్డుపై కానిస్టేబుల్ దాడి.. -హోంమంత్రి ఆరా

7

సభ్యత్వ నమోదులో మంగళగిరి రికార్డు

- శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే నంబర్ వన్

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- రేపు యలమందలకు చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ
- ముఖ్యమంత్రి పింఛన్ అందజేసే లబ్ధిదారుడి ఇంటిని పరిశీలించిన అరుణ్‌బాబు

నరసరావుపేట, నరసరావుపేట రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఏదోఒక గ్రామంలో నేరుగా లబ్ధిదారులను కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జనవరి నెలకు సంబంధించిన పింఛన్‌ను ఒకరోజు ముందుగా మంగళ వారం పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు నరసరావుపేట నియోజకవర్గం యలమందల గ్రామంలో ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యటించనున్నారు. హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. యలమందలలో సభావేదిక పనులు వేగవంతం చేశారు. ముఖ్యమంత్రి ద్వారా వేదిక వద్ద పింఛన్లు ఇప్పించేందుకు పది మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లకు సీఎం వెళ్లి పింఛన్లు ఇవ్వనున్న నేపథ్యంలో ఆ ఇళ్లను కలెక్టర్ అరుణ్‌బాబు ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగించేందుకు వేదికను సిద్ధం చేస్తున్నారు. త్రికోటేశ్వరస్వామిని చంద్రబాబు దర్శించుకోనున్న నేపథ్యంలో దేవదాయశాఖ కోటప్పకొండలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. యలమందల, కోటప్పకొండలో ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ, జేసీ సూరజ్‌తో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కడియాల రమేష్‌బాబు ఆదివారం పరిశీలించారు.

షెడ్యూల్ ఇలా..

10.30	: ఉండవల్లి నుంచి బయలుదేరుతారు
10.50	: హెలికాప్టర్‌లో యలమందలకు
11.30	: లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
12.35	: గ్రామంలోని లబ్దిదారులతో భేటీ
1.00	: వరకు ప్రజాప్రతినిధులతో సమావేశం
01.30	: రోడ్డుమార్గాన కోటప్పకొండకు
2.15	: త్రికోటేశ్వరస్వామి దర్శనం
2.30	: యలమందలలోని హెలిప్యాడ్‌కు
2.55	: ఉండవల్లి నివాసానికి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల, కడియాల రమేష్ తదితరులు


చంద్రబాబు పింఛన్ పంపిణీ చేసే లబ్ధిదారుడి ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

ప్రత్యేక పోలీసు బందోబస్తు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రత్యేకంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఎస్పీలు సంతోష్, సత్తిరాజు, డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐలు సురేష్‌బాబు, శరత్‌బాబు, రామకృష్ణ తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.



సైనిక పాఠశాలల్లో ప్రవేశాలు

త్రివిధ దళాలకు అవసరమైన అధికారులను పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం 33 సైనిక పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇక్కడ విద్యార్థులకు సీబీఎస్‌సీ విద్యతోపాటు, క్రమశిక్షణ, భౌతిక నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఇస్తారు. ఈ పాఠశాలల్లో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశాల నోటిఫికేషన్(ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్-2025) వెలువడింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవీ అకాడమీ, ఇతర అకాడమీల్లో చేరడానికి సిద్ధం అవుతారు. 'ఏఐఎస్ఎస్ఈఈ' దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే దాఖలు చేయాల్సి ఉంటుంది.

చివరి తేదీ 2025 జనవరి 13.

6వ తరగతి: 10 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు (2013 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

9వ తరగతి: 13 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు (2010 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31లోపు జన్మించి) ఉండాలి.

పరీక్షా విధానం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ద్వారా నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా రాత విధానంలో ఉంటుంది. ఆరో తరగతి పరీక్ష అన్ని ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. దీనిని రెండున్నర గంటల్లో రాయాలి. తొమ్మిదో తరగతి పరీక్ష ఇంగ్లీషులో మాత్రమే నిర్వహిస్తారు. దీనిని విద్యార్థులు మూడు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు విధానం: https://aissee.nta.nic.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, నివాస, జనన ధృవీకరణ సర్టిఫికెట్‌లతోపాటు పాస్‌పోర్ట్ ఫోటో అవసరం అవుతాయి. జనరల్, ఓబీసీ, డిఫెన్స్ కేటగిరీ వారికి రూ.800/- ఫీజు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 650/- ఫీజు ఉంటుంది.

సైనిక్ స్కూల్స్: తెలుగు రాష్ట్రాల విద్యార్థుల కోసం రెండు సైనిక పాఠశాలలు ఉన్నాయి. ఒకటి విజయనగరం జిల్లాలోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరి. దీనిలో 65 స్థానిక విద్యార్థులకు, మిగిలిన 35 శాతం జాతీయ కోటాలోకి వెళుతుంది. అంటే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి స్కూల్స్‌తోపాటు జాతీయ కోటా 35 శాతం(అంటే దాదాపు 400 సీట్ల)కి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

కౌన్సెలింగ్ ప్రాసెస్: ప్రవేశ పరీక్ష పూర్తయిన 45 రోజుల లోపు స్కోర్ కార్డు ఇంటికి వస్తుంది. ఇందులో అర్హత పొందిన విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు. ఇది దాదాపు 8 రౌండ్లుగా ఉంటుంది.

కలికిరి స్కూల్ - మొత్తం సీట్లు 105

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	10	1
ఎస్టీ	04	1
ఓబీసీ	18	1
డిఫెన్స్	08	1
జనరల్	26	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)



కోరుకొండ స్కూల్ - మొత్తం సీట్లు 93

స్థానిక కోటా	బాలురు	బాలికలు
ఎస్సీ	08	1
ఎస్టీ	04	1
ఓబీసీ	16	1
డిఫెన్స్	07	1
జనరల్	22	1

(మిగిలిన సీట్లు జాతీయ కోటా కిందకు వెళతాయి)



ప్రిపరేషన్: ఆరో తరగతి: ప్రధానంగా ఐదో తరగతి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు చదవాలి. మొత్తం మార్కులు 200(మేథ్స్: 50, జనరల్ నాలెడ్జ్: 50, ఇంగ్లిష్: 50, జనరల్ ఇంటెలిజెన్స్: 50)

తొమ్మిదో తరగతి: మొత్తం మార్కులు 400(మేథ్స్: 200, సైన్స్: 50, ఇంగ్లిష్: 50, ఇంటెలిజెన్స్: 50, సోషల్: 50) (ప్రతీ సబ్జెక్టులో కనీసం 25 శాతం మార్కులు రావాలి. టోటల్‌గా కనీసం 40 శాతం మార్కులు రావాలి)

తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

- ఎస్.కళ్యాణి
ప్రిన్సిపాల్, కాంత్రి కీన్ అకాడమి, హైదరాబాద్

నాల్కోలో టెన్త్, ఐటీఐ వారికి ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ 'నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో) నుంచి 518 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల కోసం నోటిఫికేషన్ వెలువడింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి జూనియర్ ఆపరేటివ్ ట్రైనీలుగా నియమిస్తారు.

లాబొరేటరీ: 37 పోస్టులు- కెమిస్ట్రీ సబ్జెక్టుగా బీఎస్సీ ఆనర్స్ చదివి ఉండాలి.

ఆపరేటర్: 226 పోస్టులు. టెన్త్, ఐటీఐ చేసి ఎలక్ట్రానిక్స్, మెకానిక్స్, టెక్నీషియన్ మెకట్రానిక్స్, ఎలక్ట్రీషియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఏదో ఒకటి చేసి ఉండాలి.

ఫిట్టర్: 72 పోస్టులు-టెన్త్, ఫిట్టర్ ట్రేడ్‌లో ఐటీఐ అప్రెంటిస్‌షిప్ చేసి ఉండాలి.

ఎలక్ట్రికల్: 63 పోస్టులు-టెన్త్, ఐటీఐ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్: 48 పోస్టులు- టెన్త్, మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి.

మైనింగ్ మేట్: 15 పోస్టులు - టెన్త్, మైనింగ్ మేట్ సర్టిఫికెట్

మోటార్ మెకానిక్: 22 పోస్టులు-టెన్త్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల ఐటీఐ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్.

నర్స్(గ్రేడ్-3): 7 పోస్టులు- ఇంటర్‌తోపాటు, మూడు సంవత్సరాల జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఉండాలి. లేదా డిప్లొమా/బీఎస్సీ నర్సింగ్, ఒక సంవత్సరం అనుభవం ఉండాలి.

ఫార్మసిస్ట్: 6 పోస్టులు- సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్, ఫార్మసీ డిప్లొమా ఉండాలి. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉంటే ప్రాధాన్యం.

● లాబొరేటరీ, ఫస్ట్‌ఎయిడ్ తదితరాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారి వయసు 35 సంవత్సరాలు నిండి ఉండరాదు. మైనింగ్‌కు 28, ఇతర పోస్టులకు 27 సంవత్సరాలు దాటరాదు. అభ్యర్థులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. 2024 డిసెంబరు 31 నుంచి 2025 జనవరి 21 తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. పూర్తి వివరాలకు https://nalco-india.com/ వెబ్‌సైట్ చూడొచ్చు.

దిక్సూచి DIKSUCHI



ఎస్‌బీఐలో పీఓలు 600

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 600 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 జనవరి 16 తేదీ వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవాలి. అభ్యర్థులను ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఆఫీసర్ 600 పోస్టులు (ఎస్సీ-87, ఎస్టీ-57, ఓబీసీ-158,ఈ డబ్ల్యుఎస్-58, యూఆర్-240)

అర్హతలు: ఏదైనా సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయస్సు: 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి(2024 ఏప్రిల్ 1 నాటికి) (1994 ఏప్రిల్ 2 - 2003 ఏప్రిల్ 1 మధ్యలో జన్మించి ఉండాలి). వివిధ వర్గాల వారికి కేటగిరీలను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఫీజు: రూ.750/- (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు చెల్లింపులో కొంత మినహాయింపు ఉంది)

చివరి తేదీ: 2025 జనవరి 16

ప్రిలిమినరీ పరీక్ష: మార్చి 8, 15న నిర్వహిస్తారు.

ఎంపిక విధానం

ప్రిలిమినరీ: వంద మార్కులకు వంద ప్రశ్నలుంటాయి. ఒక గంట సమయంలో పూర్తి చేయాలి. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. ఇంగ్లీషు 40 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు

మెయిన్స్: మొత్తం 200 మార్కులకు 170 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల్లో పూర్తి చేయాలి. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్(40 ప్రశ్నలు-60 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్(30 ప్రశ్నలు-60 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/ఎకానమీ/ బ్యాంకింగ్ నాలెడ్జ్(60 ప్రశ్నలు, 60 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ (40 ప్రశ్నలు, 20 మార్కు లు). డిస్క్రిప్టివ్ పేపర్ 50 మార్కులకు ఉంటుంది. దీనిని 30 నిమిషాల్లో పూర్తి చేయాలి.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, చిత్తూరు, ఏలూరు, గుం టూరు, విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం.

వివరాలకు bank.sbi/web/careers/current-openings వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

Dr. A.P.J.Abdul Kalam Young Research Fellowship

Description: Dr. A. P. J. Abdul Kalam Young Research Fellowship 2024 is an opportunity provided by the Technology, Education, Research and Rehabilitation for the Environment (TERRE) Policy Center to students pursuing or have completed undergraduate, postgraduate or Ph.D. degree in any field related to environmental research.

Eligibility: Applicants must be Indian citizens pursuing or having completed an undergraduate or postgraduate degree (M.Sc., M.E., M.A.) or Ph.D. degree in any field related to environmental research. They must be between the age group of 18 and 25 years old as of December 31st, 2024, and demonstrate outstanding research contributions made in India towards environmental protection or improvement.



Prizes & Rewards: A fellowship of up to 25,000 and a certificate

Last Date to Apply: 15-02-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/APJF1

Deakin India Postgraduate Bursary

Description: The Deakin India 20% Postgraduate Bursary 2024 is an opportunity provided by Deakin University, Australia to Indian graduates. This bursary aims to financially assist deserving students with their university fees and all study costs.

Eligibility: Open for Indian citizens with a valid Indian passport and residing in India at the time of application. They must also apply through a Deakin Authorised Agent based in India and have an overall score of 55% – 74.99% in their undergraduate degree.

Prizes & Rewards: A 20% reduction in tuition fees *Last Date to Apply:* 31-01-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/DIPB4

SCHOLARSHIP ALERT

Kotak Suraksha

Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.

Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.

Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year

Last Date to Apply: 23-01-2025


Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

యాక్షన్ హంగామా




సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'సికందర్'. రష్మిక మందన్న కథానాయిక. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో సల్మాన్ లుక్, సంభాషణలు, యాక్షన్ హంగామాతో పాటు విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ టీజర్ చూసిన అభిమానులు.. ఈ సారి సల్మాన్‌కు హిట్ పక్కా అని ఆనందపడుతున్నారు. వచ్చే ఏడాది రంజాన్ కానుకగా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. అయితే, ఈ టీజర్ సల్మాన్ పుట్టినరోజున విడుదల కావాల్సి ఉండగా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఒక రోజు వాయిదా వేశారు. కాగా, ఇటీవలే విడుదలైన 'బేబీ జాన్', 'సింగమ్ అగైన్' చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించిన సల్మాన్ అభిమానులను అలరించారు.

రొమాంటిక్ ఎంటర్‌టైనర్



కిరణ్ అబ్బవరం నటించిన కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. విశ్వకరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సినిమా టీజర్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 3న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. 'ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'క' సూపర్ హిట్ తరువాత కిరణ్ అబ్బవరం చేస్తున్న చిత్రంగా 'దిల్ రూబా'పై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి' అని చిత్రబృందం పేర్కొంది.



ఇక దబిడి దిబిడే

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబి కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డాకు మహారాజ్'. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో బాలకృష్ణతో కలసి స్టెప్పులేశారు బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా. ఈ పాట ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. 'అమెరికాలో జనవరి 4న, ఇండియాలో జనవరి 5న 'డాకు మహారాజ్' సినిమాలోని మూడో పాటను విడుదల చేయనున్నాం. ఇక దబిడి దిబిడే' అంటూ చిత్రబృందం సోషల్ మీడియాలో పేర్కొంది.



జనవరి 1న ట్రైలర్

దిల్ రాజు

హీరో రామ్‌చరణ్ 256 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటుచేసి మెగా అభిమానులు వరల్డ్ రికార్డు సాధించారని నిర్మాత దిల్ రాజు కొనియాడారు. విజయవాడలోని వజ్రా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కటౌట్‌కు ఆదివారం హెలికాప్టర్ ద్వారా పూలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దిల్ రాజు మాట్లాడుతూ సినీ రాజధాని, తెలుగు సినిమా పుట్టినిల్లుగా పేరొందిన విజయవాడలో ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జనవరి 1న గేమ్‌చేంజర్ ట్రైలర్ విడుదల చేస్తున్నామని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చే సమయాన్ని బట్టి జనవరి 4, 5 తేదీల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కటౌట్‌ను ఏర్పాటు చేసినందుకు గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ రికార్డ్‌ను ఆ సంస్థ ప్రతినిధులు దిల్ రాజుకు అందజేశారు.

విజయవాడ (లబ్బీపేట),(ఆంధ్రజ్యోతి)



ప్రియాంక రీ ఎంట్రీ

బాలీవుడ్ ముద్దుగుమ్మ ప్రియాంక చోప్రా తిరిగి భారతీయ చిత్రాల్లో నటించనున్నారా? అంటే అవుననే అంటోంది బాలీవుడ్ మీడియా. ఎనిమిదేళ్ల క్రితం హాలీవుడ్‌కి వెళ్లిన ప్రియాంక 'సిటాడెల్', 'ద మ్యాట్రిక్స్ రిసరెక్షన్స్' వంటి వెబ్‌సిరీస్, సినిమాలతో పాపులర్ అయ్యారు. కాగా, బాలీవుడ్ డైరెక్టర్ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించనున్న 'జీ లే జరా' చిత్రంలో ప్రియాంక నటించనున్నారనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలను ప్రియాంక గానీ, నిర్మాణ సంస్థ గానీ ధృవీకరించలేదు. దాంతో ఆమె రీ ఎంట్రీ ఇచ్చే సినిమా ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో మరో వార్త బాలీవుడ్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. మహేశ్ బాబు హీరోగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించే ఎస్ఎస్ఎంబీ29 సినిమాలో ప్రియాంక ఛాన్స్ కొట్టేశారనే వార్తలు బాలీవుడ్ మీడియాలో వెలువడుతున్నాయి. దీంతో భారతీయ చిత్రాల్లోకి ప్రియాంక చోప్రా ఎంట్రీ ఇచ్చే మూవీ ఇదేనని ఆమె అభిమానులు చర్చించుకుంటున్నారు.

మలయాళ సినిమాకు రూ.700 కోట్ల నష్టం

ప్రతీ ఏడాది విభిన్న తరహా చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది మలయాళ చిత్ర పరిశ్రమ. కానీ ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయినట్లు కేరళ చిత్ర నిర్మాతల సంఘం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ఏడాది రూ. 1000 కోట్లు పెట్టి 199 సినిమాలు నిర్మించగా.. కేవలం 26 చిత్రాలు మాత్రమే విజయతీరాలకు చేరాయని తెలిపింది.

పారితోషికమే పెద్ద సమస్య

"సినిమాల బడ్జెట్ అదుపులో ఉంటే ఉండాలి. తక్కువ బడ్జెట్‌తో సినిమాలు తీయాలి. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో ఎక్కువగా ఫ్లాప్ అయ్యినందున ప్రొడక్షన్ ఖర్చుల్లో కోత విధించాలి. నటీనటుల పారితోషికం ఒక పెద్ద సమస్యగా మారింది. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోవడానికి సిద్ధపడాలి. ఈ విషయాన్ని పలుసార్లు నటీనటులతో ప్రస్తావించాం. కానీ వారు తగ్గించుకోకపోగా మరింతగా పారితోషికాన్ని పెంచుకుంటున్నారు. నటులు తమ పారితోషికాన్ని తగ్గించుకోకుంటే తీవ్ర సంక్షోభం తప్పదు. పక్క రాష్ట్రాల్లో తగిన మార్కెట్ లేకుండా ఏడాదికి దాదాపు 200 చిత్రాలు నిర్మించడం దీర్ఘకాలంలో పరిశ్రమ మనుగడకు చేటు చేస్తుంది. ఈ ఏడాది విడుదలైన చిత్రాల్లో స్టార్ హీరోలు నటించిన వాటికంటే మోస్తరు బడ్జెట్‌తో నిర్మించినవే హిట్ అవ్వడాన్ని మేకర్స్ గమనించాలి. అందుకు తగ్గట్లు సినిమాల నిర్మాణంలో మార్పులు చేసుకోవాలి. థియేటర్లకు ప్రజలని రప్పించే సినిమాలపై దృష్టి పెట్టాలి. ఈ ఏడాది మొత్తం 199 చిత్రాలు విడుదలయ్యాయి. అందులో కేవలం 26 చిత్రాలు విజయవంతం అయ్యాయి. రూ.1000 కోట్ల పెట్టుబడి పెడితే కేవలం రూ.300 కోట్లు మాత్రమే తిరిగి పొందగలిగాము. రూ.700 కోట్ల నష్టం వచ్చింది" అని రిపోర్ట్‌లో కేరళ చిత్ర నిర్మాతల సంఘం పేర్కొంది.

చక్కని ఆదరణ లభిస్తోంది



శివ రెడ్డి హీరోగా ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. లయన్ శ్రీరాం దత్తి నిర్మించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో 'ఓ తండ్రి తీర్పు' చిత్రాన్ని నిర్మించారు. ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేకపోవడం ఎంతో మానసిక క్షోభకు గురిచేస్తుంది అనే ఇతివృత్తంతో తీసిన ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి రుజువు అయ్యింది. చక్కటి సందేశం ఉన్న ఈ సినిమాను ప్రతి కుటుంబం చూడాలని కోరుతున్నా' అని అన్నారు.




మరోసారి నువ్వే కావాలయ్యా

రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంలో 'నువ్వే కావాలయ్యా' అంటూ ప్రత్యేక గీతంలో నర్తించి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేశారు తమన్నా భాటియా. సినిమా విజయంలో ఆ గీతం సైతం కీలకపాత్ర పోషించింది. ఇప్పుడు మరోసారి జైలర్‌తో కలసి సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారట తమన్నా. 'జైలర్ 2'లోనూ తమన్నా ప్రత్యేక గీతంలో మెరవనున్నారని కోలీవుడ్ టాక్. అంతేకాదు దర్శకుడు నెల్సన్ రెండో భాగంలో ఆమె పాత్ర నిడివిని పెంచారనీ, కథలో కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అలాగే 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి కూడా ఈ చిత్రంలో నటించబోతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.

మార్చిలో సెట్స్‌పైకి షారుక్ చిత్రం

షారుక్ ఖాన్ సుజయ్ ఘోష్ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'కింగ్'. రెడ్ చిల్లీస్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాలో అభిషేక్ బచ్చన్ నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో నటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు



జరుగుతున్నాయి. ఇందులోని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం అంతర్జాతీయ స్టంట్ డైరెక్టర్లు పనిచేయనున్నట్లు బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కూడా నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

జార్ఖండ్ గెలుపు లాంఛనమే...

● అర్జున్ ప్రియదర్శి ఆల్‌రౌండ్ షో


అర్జున్ (150 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జమ్ము కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో జార్ఖండ్ గెలుపు దాదాపు ఖాయమైంది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ము కశ్మీర్ జట్టు 129 పరుగులకు ఆలౌటయింది. ఓవర్‌నైట్ స్కోరు 143/3 పరుగులతో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు 7 వికెట్ల నష్టానికి 365 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జార్ఖండ్ బ్యాటర్ అర్జున్ ప్రియదర్శి 177 బంతుల్లో 150 పరుగులు, రాజ్‌వీర్ 137 బంతుల్లో 67 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన జమ్ము కశ్మీర్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. జార్ఖండ్ ఆటగాడు అర్జున్ ప్రియదర్శి బౌలింగ్‌లో కూడా రాణించి 5 వికెట్లు పడగొట్టాడు. ఆటకు మరో రోజు మిగిలివుండగా జమ్ము కశ్మీర్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లోనే 116 పరుగులు వెనుకబడి ఉంది. జార్ఖండ్ జట్టు విజయానికి మరో రెండు వికెట్లు పడగొట్టాల్సి ఉంది.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయండి

● ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న తులసీ విష్ణుప్రసాద్, హాజరైన నూతన కార్యవర్గ సభ్యులు

గుంటూరు (విద్య) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధికి ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని, విద్యార్థులు వేగంగా లక్ష్యాన్ని చేరుకోవడం నేర్పడం కంటే ముందు వారిని సరైన దిశలో లక్ష్యం కోసం పయనించేలా మార్గనిర్దేశం చేయాలని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జరిగిన ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మ) సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పాలనే కోణంలో ఆలోచించాలన్నారు. నూతన విద్యా చట్టానికి అనుగుణంగా రానున్న కాలంలో విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు వస్తాయని తెలిపారు. ఈ తరం పిల్లలు ఎంతో చురుకైన వారనీ, చిన్న వయసులోనే తల్లిదండ్రులు సరైన శిక్షణ ఇస్తే అభివృద్ధిలో దూసుకు పోతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అపుస్మా రాష్ట్ర నూతన కార్యవర్గం ఇదే..

ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడు కె.తులసి విష్ణు ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీవీ రమణారెడ్డి, అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా జేఎస్పీ బాలాజీ, సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎంవీ సుబ్బారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎం.కృష్ణలతోపాటు పదహారు మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్లు డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, రాష్ట్ర నలుమూలల నుంచి అపుస్మ సభ్యులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో మంగళగిరి రికార్డు

● శాశ్వత సభ్యత్వాల్లో రాష్ట్రంలోనే నంబర్ వన్


టీడీపీ సభ్యత్వ నమోదు

మంగళగిరి సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదులో చరిత్ర సృష్టించింది. సభ్యత్వాల సంఖ్య ఏకంగా లక్ష దాటి గుంటూరు పార్లమెంటులోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళగిరి నియోజకవర్గ చరిత్రలో ఇదొక రికార్డు. అలాగే శాశ్వత సభ్యత్వాలలో రాష్ట్రంలోనే మొదటి స్థానం దక్కించుకుంది. 80 మంది నాయకులు ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు అక్టోబరు 26న ప్రారంభమైంది. రూ.వంద సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్‌కు వచ్చిన మెజార్టీ మాదిరిగానే నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు నమోదవుతాయని ముందుగానే అంచనా వేయగా, ఇప్పటికే లక్ష సభ్యత్వాల మార్కును దాటడం విశేషం. మంగళగిరిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తారన్న నమ్మకంతో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాలను స్వీకరించేందుకు ముందుకు వస్తున్నారు. గతంలో అత్యధికంగా 51,951 సభ్యత్వాలు నమోదు కాగా, ఈ మారు లక్ష దాటించి గతంలో ఉన్న రికార్డును తిరగరాశారు. నియోజకవర్గంలో మొత్తం 2,83,575 మంది ఓటర్లు ఉండగా, ఆదివారం సాయంత్రం నాటికి మొత్తం లక్షా 422 సభ్యత్వాలు నమోదైనట్టు పార్టీ వర్గాలు ప్రకటించాయి. రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు కావడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

తీసుకోవడం.. అమ్ముకోవడం!

● కొనుక్కున్న వారు రూ. లక్షలిచ్చి అధికారికం చేయించుకోవడం

● ఇదీ యార్డులో కమీషన్ లైసెన్సుల వ్యాపారం తీరు

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కమీషన్ ఏజెంట్ లైసెన్సుల అనధికార వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పలుకుబడిని ఉపయోగించి సిఫార్సులు చేయించి మంజూరు చేయించుకొంటున్న లైసెన్సులను చాలామంది పెద్ద పారంలకు అమ్మేస్తున్నారు. దీంతో వ్యాపారం చేసేది ఒకరైతే, లైసెన్సులో మరో పేరుంటుంది. వాటిని సక్రమం చేసుకొనేందుకు ప్రొప్రయిటర్ మార్పు కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఇలా ప్రొప్రయిటర్ పేరు మార్చినందుకు రూ. లక్షల్లో మార్కెటింగ్ శాఖ అధికారులు దండుకొంటున్నారు. దీనిపై మార్కెట్ కమిటీల చట్టంలో స్పష్టమైన నిబంధనలు ఏవీ లేకపోవడంతో ఎవరు ఇష్టమొచ్చినట్లు వాళ్లు చేస్తున్నారు.

దాదాపు రూ. 5 కోట్లకు పైగా చేతులు మారాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ఏడాది ముందు ఈ ప్రొప్రయిటర్ పేరు మార్పులకు తెర తీశారు. కొంతమంది హైకోర్టును ఆశ్రయించడం, అక్కడ మార్కెటింగ్ అధికారులు తగిన వాదనలు వినిపించలేకపోవడంతో కమీషన్ వ్యాపారస్తులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు తీర్పు ఆధారంగా చేసుకొని అప్పటి మార్కెటింగ్ కమిషనర్ మొత్తం 64 లైసెన్సులకు సంబంధించి ప్రొప్రయిటర్ పేరు మార్పులకు అనుమతించారు. ఈ ఉత్తర్వులను అనుసరిస్తూ ఏకంగా 286 లైసెన్సులకు సంబంధించి ప్రొప్రయిటర్ పేరు మార్పులను అప్పటి మిర్చియార్డు చైర్మన్, సెక్రెటరీ కలిసి చేసేశారు. ఒక్కో ప్రొప్రయిటర్ పేరు మార్పు కోసం రూ. 2 లక్షలకు తగ్గకుండా వసూలు చేయడంతో దాదాపుగా రూ. 5 కోట్లకు పైగా ఈ ఒక్క వ్యవహారంలోనే నగదు చేతులు మారినట్లు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయ అధికారులు కూడా తప్పుబట్టారు. ఏ ఆధారం చేసుకొని ఇలా ప్రొప్రయిటర్ పేర్లు మార్చారని మార్కెటింగ్ అధికారులను ప్రశ్నించారు.

మార్పులు చెల్లుతాయా... లేదా!

మిర్చి కమీషన్ ఏజెంట్ లైసెన్సులకు సంబంధించి ప్రొప్రయిటర్ పేరు మార్పులు చేసినవి చెల్లుబాటు అవుతాయా, లేదానన్న ప్రశ్న ఇప్పుడు మిర్చియార్డులో తలెత్తింది. మార్కెటింగ్ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా చేసిన ప్రొప్రయిటర్ పేరు మార్పులు చెల్లవని కొంతమంది వాదిస్తున్నారు. అయితే హైకోర్టు తీర్పు ఆధారంగానే అప్పటి మార్కెటింగ్ కమిషనర్ జాయింట్ డైరెక్టర్, మిర్చియార్డు చైర్మన్, సెక్రెటరీతో ఒక త్రిసభ్య కమిటీని నియమించి 64 లైసెన్సుల ప్రొప్రయిటర్ మార్పులకు అనుమతించారని, ఈ నేపథ్యంలో ప్రతీసారి కమిషనర్ ప్రొసీడింగ్స్ అవసరం లేదన్న వాదనని తెరపైకి తెస్తున్నారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆయా లైసెన్సులన్నింటిని తాము పునర్‌పరిశీలిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏమి నిర్ణయం ప్రకటిస్తుందన్న విషయం ఉత్కంఠగా మారింది.

చాంబర్ ఎన్నికల్లో యేల్చూరి ప్యానల్ ఘన విజయం

● 180 ఓట్ల ఆధిక్యంతో గెలుపు

● తెల్లవారుజామున 3 గంటల తరువాత ఫలితాలు ప్రకటన


వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేస్తున్న బాబు, సత్యం, టీఎల్‌వీ

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠభరితంగా సాగిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు ప్యానల్ ఘన విజయం సాధించింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 985 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. కాగా రహస్య బ్యాలెట్ రూపంలో జరిగిన ఎన్నికలు ముగిసిన తరువాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన చాంబర్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో అర్ధరాత్రి తరువాత తెల్లవారుజాము 3 గంటల తరువాత ఫలితాలను ప్రకటించారు. చాంబర్ అధ్యక్షుడుగా మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు 577 ఓట్లతో గెలుపొందారు. ప్రత్యర్థి రంగా బాలకృష్ణ ఓటమి చెందారు. 180 ఓట్ల ఆధిక్యంతో యేల్చూరి వెంకటేశ్వర్లు విజయం సాధించినట్లు ప్రకటించారు. అలానే అధ్యక్ష బరిలో నిలిచిన రంగా బాలకృష్ణ సోదరుడు రంగా రామకృష్ణకు 8 ఓట్లు పోలయ్యాయి. ఇక యేల్చూరి ప్యానల్‌లో కార్యదర్శులు ముగ్గురైన గార్లపాటి సత్యనారాయణ, గొల్లపూడి కాశీ వెంకట రాంబాబు, షరాబు కృష్ణమూర్తి గెలుపొందారు. మరో వైపు ఆరుగురు ఉపాధ్యక్షులు ఆతుకూరి నగేష్‌కుమార్, కొప్పురావూరి ఏడుకొండలు, టీఎల్‌వీ వీరాంజనేయులు, తడికమళ్ల సూర్యప్రకాష్‌రావు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, వజ్రాల వెంకటనాగిరెడ్డి విజయం సాధించారు. మరో 29 మంది ఈసీ సభ్యులుగా గెలుపొందారు. ఈసీ సభ్యుల్లో రంగా బాలకృష్ణ ప్యానల్‌కు చెందిన బచ్చు సుబ్బయ్య విజయం సాధించారు. చాంబర్ అనుబంధ సంఘాల్లో యేల్చూరి ప్యానల్‌లో ఐదుగురు గెలుపొందగా, బాలకృష్ణ ప్యానల్ నుంచి మరో నలుగురు గెలుపొందినట్లు మాజీ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు తెలిపారు.

చాంబర్ అధ్యక్షుడు యేల్చూరికి అభినందనలు...

చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడుగా ఘన విజయం సాధించిన యేల్చూరి వెంకటేశ్వర్లును కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ళ సత్యం, ఆతుకూరి నగేష్‌కుమార్, టీఎల్‌వీ వీరాంజనేయులు పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

కూటమి.. క్లీన్‌స్వీప్

(5వ పేజీ తరువాయి)

నాయకులతో కలిసి హాజరయ్యారు. ఆ సభ నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో భారీ జనసంద్రం మధ్య జరిగింది. అదే సభ వైసీపీ ఓటమికి నాంది పలికింది. ఆ సభ నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యంపై ఈసీ సీరియస్ అయింది. పోలింగ్ సందర్భంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రణరంగంగా మారింది. మాచర్ల నియోజకవర్గంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఏకంగా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి ఈవీఎంని ధ్వంసం చేశారు. అది సీసీ టీవీలో స్పష్టంగా రికార్డు కాగా దేశవ్యాప్తంగా సంచలనమైంది. రెంటచింతల మండలంలో టీడీపీ బూత్ ఏజంట్‌గా ఉన్న మంజులరెడ్డిపై వైసీపీ రౌడీమూకలు గొడ్డలితో దాడి చేయగా వెనకడుగు వేయకుండా ధీరోదాత్తాన్ని ప్రదర్శించారు. ఆమె చూపించిన తెగువ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తెనాలిలో అయితే అప్పటి వైసీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పోలింగ్ బూత్‌లో ప్రశ్నించినందుకు ఓటరుపై చేయి చేసుకోగా ఓటరు ఎదురు తిరిగి తగిన బుద్ధి చెప్పడం దేశవ్యాప్తంగా సంచలనమైంది. గురజాలలో కాసు మహేష్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా ఓటర్లు తరిమి కొట్టారు. పెదకూరపాడులో నంబూరు శంకరరావు, నరసరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని కూడా ఓటర్లు పరుగులు పెట్టించారు.

చరిత్రలో నిలిచిపోయిన జూన్ 4న

మే 13న పోలింగ్ జరగ్గా జూన్ 4 వరకు అందరూ ఓటరు తీర్పు కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఓట్ల లెక్కింపు రోజున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లీ నియోజకవర్గాలు, బాపట్ల జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీల్లోనూ మొదటి రౌండ్ లెక్కింపు నుంచే భారీ మెజార్టీలతో కూటమి అభ్యర్థులు దూసుకుపోయారు. నారా లోకేశ్, గల్లా మాధవి, నసీర్ అహ్మద్, చదలవాడ అరవిందబాబు, బ్రహ్మారెడ్డి, వేగేశన నరేంద్రవర్మ, నాదెండ్ల మనోహర్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి, ఏలూరి సాంబశివరావు, కొండయ్యల విజయంతో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో వైసీపీ చాలా నియోజకవర్గాల్లో కూకటి వేళ్లతో పెకిలించుకుపోయింది. కాగా 100 శాతం గెలుపుని కట్టబెట్టినందుకు చంద్రబాబు తన మంత్రివర్గంలో లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవిలకు అవకాశం కల్పించారు. అలానే గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ని కేంద్ర మంత్రివర్గంలో కూర్చోబెట్టారు.

కాలేజీల్లోనూ.. మధ్యాహ్న భోజనం

(5వ పేజీ తరువాయి)

వస్తారు. మధ్యాహ్నం భోజనానికి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనాన్ని కళాశాలల్లో గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసింది. పైగా పథకం అమలుతో కళాశాలల్లో అడ్మిషన్లు కూడా పెరిగాయి. అయితే జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కళాశాలల్లో ఈ పథకాన్ని నిలిపివేశారు. దీంతో విద్యార్థులు భోజన ఇక్కట్లకు లోనయ్యారు. కొన్ని కళాశాలల్లో అడ్మిషన్లు కూడా కొంత తగ్గినట్లు సమాచారం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మళ్లీ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ పథకం అమలుతో మళ్లీ ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పథకం పునరుద్ధరణపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల ఏజెన్సీలకే బాధ్యత

ప్రస్తుతం పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న ఏజెన్సీలకే కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యతలను విద్యాశాఖ అప్పగించింది. కళాశాలకు దగ్గరలో ఉండే పాఠశాల ఏజెన్సీలకు పథకం బాధ్యతలను అప్పగించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కళాశాలల వారీగా వంట ఏజెన్సీలను నియమించినట్లు తెలిపారు. పాఠశాలల్లో అమలు చేస్తోన్న మెనూనే కళాశాలల్లో కూడా అమలు చేయనున్నారు. విద్యార్థులకు రాగిజావ, చిక్కీ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

● ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్‌బాబు



ఎస్టీయూ నాయకులతో కలిసి డైరీ ఆవిష్కరిస్తున్న జోసఫ్ సుధీర్‌బాబు

బాపట్ల డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కోశాధికారి జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం 78వ వార్షిక జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లాలోని 25 మండలాల నుంచి శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి జోసఫ్ సుధీర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న సొమ్మును ఖర్చు పెట్టేసి మొండిచేయి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు అయినప్పటికీ పెండింగ్ బకాయిల విషయంలో నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించటం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి ఆగ్రహం తెప్పిస్తుందన్నారు. మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. 117 జీవో రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అనేక రకాలైన యాప్‌ల వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరం కావటంతో పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఒకే సమయంలో ఓ వైపు ఉపాధ్యాయులకు శిక్షణలు, మరో వైపు పరీక్షల నిర్వాహణ, అపార్ మొదలైన పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య మాట్లాడుతూ బదిలీ చట్టం పారదర్శకంగా రూపొందించాలని, ఉపాధ్యాయులకు నష్టం కలగని రీతిలో సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ పీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌లు చందా నరసింహారావు, గుగ్గిలం ఉదయ్‌శంకర్, వంకా ప్రభాకరరావు, కేఏకే జిలానీ, బొంతా వెంకటేశ్వర్లు, నూరుబాషా, సుభాని, సీపీఐ జిల్లా కార్యదర్శి తస్నీరు సింగరకొండ, కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీధర్, జి.నాంచారయ్య, పి.శివాంజనేయులు, శ్రీనువాసరావు, టి.శివయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డైరీ ఆవిష్కరించారు.

వీరాంజనేయ స్వామికి జస్టిస్ ఎన్‌వీ రమణ ప్రత్యేక పూజలు


స్వామి దర్శనంలో జస్టిస్ ఎన్‌వీ రమణ

పొన్నూరుటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన జస్టిస్ ఎన్‌వీ రమణకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారిని జస్టిస్ రమణ దర్శించుకున్నారు. వీరాంజనేయ స్వామికి నిర్వహించిన నాగవల్లీ దళార్చన పూజా కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఈవో గద్దె అమర్నాథ్ జస్టిస్ ఎన్‌వీ రమణ దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను అందజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. దైవ దర్శనానికి పొన్నూరు పట్టణానికి విచ్చేసిన జస్టిస్ ఎన్‌వీ రమణకు ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాలతో ఆలయం వద్ద టీడీపీ నాయకులు జస్టిస్ రమణకు ఘన స్వాగతం పలికారు. బాపట్ల మెజిస్ట్రేట్ జి.వాణి, తహసీల్దార్ జియావుల్ హక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాచర్ల - గుంటూరు - విజయవాడ రైలుకు క్రాసింగ్, ప్రిసిడెన్స్ కష్టాలు

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిత్యం సాయంత్రం వేళ మాచర్లలో బయలుదేరి గుంటూరుకు వచ్చి విజయవాడకు వెళ్లే ప్యాసింజర్ రైలు సమయపాలనని క్రాసింగ్, ప్రిసిడెన్స్‌లు దెబ్బ తీస్తున్నాయి. దీంతో ఈ రైలులో ప్రయాణిస్తున్న వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరే ఈ రైలు నడికుడి వరకు బాగానే వస్తుంది. ఆ తర్వాత నుంచి ఏ స్టేషన్‌లో గంటల తరబడి క్రాసింగ్, ప్రిసిడెన్స్ కోసం నిలిపేస్తారో తెలియని పరిస్థితి. ఇక ఆదివారం వస్తే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇందుకు కారణం ఆ రోజున స్పెషల్స్ కూడా ఈ మార్గంలో ప్రయాణిస్తుండటమే. రాత్రి 7.45 గంటలకు గుంటూరుకు వచ్చి 8.10కి విజయవాడకు బయలుదేరాల్సిన ఈ రైలు 9 గంటల సమయం దాటిన తర్వాత వస్తుంది. ఒక్కో రోజు మరింత ఆలస్యమౌతుంది. ఈ నేపథ్యంలో క్రాసింగ్, ప్రిసిడెన్స్‌ల సమస్య తప్పాలంటే మాచర్లలో సాయంత్రం 4 గంటలకు బయలుదేరేలా రీషెడ్యూల్ చేస్తే సరిపోతుందన్న అభిప్రాయాన్ని పలువురు వ్యక్త పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే ఆపరేటింగ్ విభాగం దీనిపై సీరియస్‌గా దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 18వ నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ అండర్-12, అండర్-17 బాల, బాలికల టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. టోర్నమెంట్‌కు 14 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరు అయ్యారని చెప్పారు. టోర్నమెంట్ ప్రారంభ సభలో ఇండియన్ ఫ్లోర్‌బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్ర ఆర్య మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ఆడి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి విజయాలు సాధించి భారతదేశ పేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఫ్లోర్‌బాల్ ఇండియా అబ్జర్వర్ పంకజ్, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ప్రీజోజాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభ మ్యాచ్‌లో చత్తీస్‌గఢ్ 5-0 పాయింట్‌లతో డిల్లీ గెలిచింది. రెండో మ్యాచ్‌లో బీహార్ జట్టు 6-0 పాయింట్‌లతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై, మూడో మ్యాచ్‌లో తమిళనాడు 3-0 పాయింట్‌లతో కర్ణాటక జట్టుపై విజయం సాధించాయి.

హోంగార్డుపై కానిస్టేబుల్ దాడి : హోంమంత్రి ఆరా

మాచర్లటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై ఏపీఎస్పీ కానిస్టేబుల్ దాడి చేసిన సంఘటనపై రాష్ట్ర హోం మంత్రి అనిత ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన రాత్రి హోంగార్డు శ్రీనివాస్ మాచర్ల పట్టణంలోని రింగురోడ్డు ప్రాంతంలో నైట్‌బీట్ విధులు నిర్వహిస్తున్నారు. ఏపీఎస్పీ కానిస్టేబుల్ మల్లికార్జున రింగురోడ్డు ప్రాంతానికి చేరుకొని హోంగార్డు శ్రీనివాస్‌పై లాఠీతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో రాష్ట్ర హోం మంత్రి అనిత దృష్టి సారించి జరిగిన సంఘటనపై విచారణ జరపాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించిన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో శనివారం ఏపీఎస్పీ కమాండెంట్ ఆర్ఐ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలను నమోదు చేసుకున్నారు. కాగా కర్నూల్ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ మల్లికార్జునను పోలీసు శాఖ ఉన్నతాధికారులు మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధుల నుంచి తొలగించి కర్నూల్‌కు పంపినట్లు తెలుస్తోంది. హోంగార్డు శ్రీనివాస్‌ను మూడు నెలలపాటు విధులకు దూరంగా ఉంచుతూ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అప్పు కింద ధాన్యం తీసుకెళ్లారని రైతు ఆత్మహత్యాయత్నం

నకరికల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణంలో ఎరువులు, పురుగు మందులు వాడుకున్నందుకుగానూ పండించిన ధాన్యం మొత్తాన్ని ఎరువుల దుకాణదారుడు తీసుకెళ్లారని రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నకరికల్లు మండలం కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెంకు చెందిన చెన్నంశెట్టి కోటేశ్వరరావు కుంకలగుంటలోని ఒక ఎరువుల దుకాణంలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఎరువులు, పురుగు మందులను అప్పుగా కొనుగోలు చేశాడు. రూ. 2 లక్షల మేర ఆ దుకాణానికి బకాయి పడ్డాడు. అప్పు కింద కోటేశ్వరరావు 60 బస్తాల ధాన్యం ఒకసారి, 34 బస్తాల ధాన్యం మరోసారి ఆ వ్యాపారికి అమ్మాడు. కొంత నగదును అప్పులో భాగంగా చెల్లించాడు. ఈ ఏడాది రెండు ఎకరాల వరి పంటను సాగు చేశాడు. రెండు ఎకరాల్లో వచ్చిన ధాన్యంలో సగం మాత్రమే అప్పు కింద తీసుకోవాలని దుకాణదారుడిని కోరాడు. కాని దుకాణదారుడు రెండు ఎకరాల్లో పండిన ధాన్యాన్ని తన అప్పు కింద తీసుకెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన కోటేశ్వరరావు శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చేర్పించారు. కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

మాచర్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పశువేములలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పేరువాల పుల్లారావు (32) తనకున్న మూడు ఎకరాల్లో పత్తి, మిర్చి పంట సాగు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో రూ. 5 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు పుల్లారావును మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ పుల్లారావు మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా దీనిపై పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాలేదు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 572.30 అడుగులు ఉంది. ఇది 262.34 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7578 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8193 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 18,471 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 40.03 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి ఐదు వందల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మరకత లింగ చంద్రమౌళేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి

నకరికల్లు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నరసింగపాడులో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని గణపతి పూజతో ప్రారంభించి చండీ హోమం, రుద్రహోమం చేశారు. మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. గంగా అన్నపూర్ణా దేవికి మహిళలు సామూహిక కుంకుమ పూజ చేశారు. విశేష అభిషేకాల అనంతరం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పమిడిమర్రు శ్రీనివాసశర్మ జరిపించారు.

నేడు కన్నా రాక

సత్తెనపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈనెల 30వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి 4 గంటల వరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీబాబు ఆదివారం తెలిపారు.

ఎంఈవో-1 కాంతారావు మృతి



కాంతారావు (ఫైల్‌ఫొటో)

దాచేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ఎంఈవో-1 కాంతారావు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఈయన ప్రస్తుతం దాచేపల్లి, మాచర్ల, వెల్దుర్తి మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. క్రిస్మస్ పండగకు కాంతారావు తన కుమార్తె నివాసముంటున్న ప్రకాశం జిల్లా అద్దంకికి వెళ్లారు. అక్కడ గుండెపోటుతో ఆదివారం ఉదయం మరణించారు. దాచేపల్లి ఎంఈవోగా రెండు నెలల క్రితం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన మృతి పట్ల ఎంఈవో-2 పినాకపాణి, గురజాల ఎంఈవో-2 సాంబశివరావు, యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు తమ సంతాపాన్ని తెలిపారు.

రేపు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం ఈ నెల 31వ తేదీ మంగళవారం బొద్రాయి సెంటర్‌లోని సచివాలయం-1లో జరుగుతుందని కమిషనర్ అప్పారావు ఆదివారం తెలిపారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పిడుగురాళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి లక్ష్మీ తులసి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని పోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా గుత్తికొండ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గుత్తికొండలోని ఎస్సీ ఎస్టీ కాలనీలలో నాలుగు దున్నపోతులను కూడా గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రే పట్టుకెళ్లినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.75వేలకు పైగా వుంటుందని బాధితులు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు.. రూ.5,100 నగదు స్వాధీనం

దాచేపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని గుంటూరు రోడ్డులో కల్యాణి దాబా గార్డెన్ సమీపంలోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న వ్యక్తుల నుంచి రూ.5,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు ఆదివారం తెలిపారు. పేకాట స్థావరంపై పోలీసులు చేసినదాడిలో ఇరువురు పట్టుబడగా మరికొందరు పరారీలో వున్నారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జలాలపురంలో ఎనిమిది మంది..

పెదకూరపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలాలపురం గ్రామంలో చెరువు కట్టపై పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. వారి నుంచి రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

● రాగి వైరు, మోటారు చోరీ

క్రోసూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసపాడులో కంచేటి రామకృష్ణ, సయ్యద్ మస్తాన్‌వలిలకు చెందిన పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితులు క్రోసూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోజులాగానే ఉదయం పొలానికి వెళ్లగా తమకు చెందిన ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడేసి ఉందని, దానిలోని రాగితీగ, సుమారు 125 లీటర్ల ఆయిల్ చోరీకి గురైనట్టు బాధితులు పేర్కొన్నారు. వ్యవసాయ మోటారును కూడా దుండగులు దొంగిలించుకు పోయినట్టు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్టు తెలిపారు.

వైభవంగా మహాన్యాస రుద్రాభిషేకం

పెదకూరపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో మహాన్యాస రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అయోధ్యస్వామి విగ్రహం, శివలింగానికి పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి రామకృష్ణ, కోటేశ్వరమ్మ, సుబ్బారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై సోషల్ మీడియా ఆడిట్ జరుగుతుందని, ఈ సమయంలో మాదిగలంతా అప్రమత్తంగా ఉండాలని మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్ కుమార్, టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు నాగరాజులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలా సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఎస్సీ కులజాబితాలో మాదిగల పేర్లు కన్పించటం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి సచివాలయానికి వెళ్ళి జాబితాలను చెక్ చేయాలన్నారు. ఇలా చేస్తే మాదిగల జనాభా లెక్క తేలుతుందన్నారు. కొన్ని జాబితాల్లో కుటుంబసభ్యుల పేర్లు మొత్తం ఉండటం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జాబితాలపై దృష్టి సారించాలని కోరారు.

28, 29 వార్డులలో వైద్య శిబిరం

సత్తెనపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28, 29వార్డులలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు కోట సైదయ్య నేత్రాలయం సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఆళ్ల స్థిమిత, కోట మణిలు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్ల, కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి సూచనలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు యేల్లినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు దారువూరి నాగేశ్వరరావు, ఆళ్ల సాంబయ్య, సయ్యద్ పెద్ద కరిముల్లా, కంబాల వెంకటేశ్వరరావు, జానీబాషా, అబ్దుల్లా, నూర్‌బాషా జానీబాబు, ఆదాం, సైదు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

సత్తెనపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న కంటి డాక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ శులభమవుతుందన్నారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది పాములయ్య, పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సౌకర్యాలున్నా... నిర్లక్ష్యమే

● ఆపరేషన్ అంటే నరసరావుపేట పరుగెత్తాల్సిందే

● వైద్యుల నిర్లక్ష్యంతో క్షతగాత్రులు, రోగుల అవస్థలు



పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పిడుగురాళ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ప్రథమ చికిత్సలకే పరిమితమయ్యాయి. గురజాల, దాచేపల్లి, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని సౌకర్యాలతో కూడిన సొంత భవనాలు వుండగా పిడుగురాళ్లలో మాత్రం మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంత భవనంలో ప్రస్తుతానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కొనసాగుతోంది. ఇక్కడ అందే కొన్నిరకాల సేవలు మినహా అత్యవసర సేవలకు గుంటూరు, నరసరావుపేటకు పరుగెత్తాల్సిందే. అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిలో ఏ ప్రమాదం జరిగినా ప్రథమ చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రులే దిక్కు అవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రథమ చికిత్సలకు వెళ్లామన్నా వైద్యుల నిర్లక్ష్యం కారణంగా క్షతగాత్రులు, రోగులు ఆ ఆలోచన కూడా చేయడంలేదు. నియోజకవర్గ కేంద్రమైన గురజాలలోని ఏరియా ఆసుపత్రిలో వారానికి ఒకరోజు కుటుంబ నియంత్రణ, ప్రసవాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. పిడుగురాళ్ల, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎటువంటి ఆపరేషన్లు జరగటం లేదు. గత ఏడాది పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్పటి కలెక్టర్ లోతేటి శివశంకర్ సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు వున్నప్పటికీ ఎందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదని ప్రశ్నించారు. గత నెలలో ప్రస్తుత కలెక్టర్ అరుణ్‌బాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సమయంలో కూడా ఆసుపత్రిలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించుకునే వీలుగా వారానికి ఒకరోజు మరో పీహెచ్‌సీ నుంచి వైద్యులను డిప్యుటేషన్‌పై పిలిపించుకునేలా చూడాలని వైద్యులకు సూచించారు. అయినా వైద్యులలో ఎటువంటి మార్పు రాలేదు. కేవలం ఆసుపత్రికి వచ్చే అవుట్ పేషెంట్‌లను చూసి మందులు ఇచ్చి పంపిస్తుంటారు. ఇక్కడ రోజువారి వచ్చే ఓపీలలో సీజనల్ జ్వరాలు, కోతి, కుక్కదాడులలో గాయాలైన వారే ఎక్కువ మంది వుంటారు. దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిక చేసిన రోగులను వారానికి ఒకసారి ఆసుపత్రికి పిలిపించి సాధారణ ప్రసవాలు మాత్రమే చేస్తుంటారు. ప్రసవం అనంతరం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మాత్రం గత ఐదారు నెలలుగా ఈ కేంద్రంలో నిలిచిపోయాయి. మాచవరం పీహెచ్‌సీలో మాత్రం ప్రస్తుతానికి వారానికి ఒకరోజు సాధారణ కాన్పులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పిడుగురాళ్లలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు కాగా, రెండు మాత్రం నిర్మాణం పూర్తిచేసుకొని కొందరు వైద్యులు అందుబాటులో వున్నారు. లెనిన్‌నగర్, పీడబ్ల్యూ కాలనీలో వున్న అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కూడా ప్రథమ చికిత్సలే చేస్తున్నారు.

సిజేరియన్ అయితే నర్సరావుపేట వెళ్లాల్సిందే...

పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాల్లోని పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులలో సాధారణ కాన్పు అయితే అక్కడి వైద్యులు కొందరు వైద్యుల సాయంతో పని కానిచ్చేస్తారు. అదే సిజేరియన్ చేయాల్సివస్తే నరసరావుపేట ఏరియా వైద్యశాలకు వెళ్లాలని సిఫార్సు చేస్తుండగా వారిలో కొంతమంది పిడుగురాళ్లలోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరి ప్రసవాల అనంతరం ఆపరేషన్లు కూడా చేయించుకుంటున్నారు. గర్భిణీ పరిస్థితి మరీ విషమంగా వుంటే గుంటూరు, నరసరావుపేట వెళ్లాల్సిన పరిస్థితి వుంది.

నిరుద్యోగ రహిత నియోజకవర్గంగా పెదకూరపాడు

జాబ్‌మేళా ప్రారంభ సభలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గాన్ని నిరుద్యోగ రహితంగా మార్చటమే లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం క్రోసూరు మండలం దొడ్లేరులో జరిగిన జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో రానున్న కొద్ది నెలల్లోనే ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. యువనాయకుడు నారా లోకేశ్ స్ఫూర్తితో రానున్న కాలంలో పెదకూరపాడు నియోజకవర్గంలో అనేక పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 20వేల మంది నిరుద్యోగులు ఉన్నట్టు గుర్తించామని, దశల వారీగా రానున్న ఐదు సంవత్సరాల్లో పదివేల మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాంద్రు కాశయ్య, వేగుంట రాణి, ఏపూరి నాగేశ్వరరావు, నందిగం ఆశీర్వాదం, నల్లమేకల వెంకటేశ్వర్లు, నలజాల సదాశివరావు, గంధం కోటేశ్వరరావు, కొండవీటి శ్రీనివాసరావు, దుద్దుల యోహాన్, డీ సాంబశివరావు, దొడ్లేరు సర్పంచ్ ముక్కు అంజలి తదితరులు పాల్గొన్నారు.

600మందికి నియామక పత్రాల అందజేత

జాబ్‌మేళాకు నిరుద్యోగులు పోటెత్తారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరిగిన జాబ్‌మేళాకు సుమారు 2500మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 10వ తరగతి విద్యార్హత నుంచి ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్‌కు చెందిన వివిధ స్థాయిల నిరుద్యోగులు హాజరయ్యారు. సుమారు 35 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 600మంది వరకు వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైనట్టు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. వారందరికీ అప్పటికప్పుడు నియామకపత్రాలను అందించారు. పలు సాఫ్ట్‌వేర్, పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి.

యూటీఎఫ్ పల్నాడు జిల్లా శాఖ ప్రచారజాత



పిడుగురాళ్ల యూటీఎఫ్ పతాకావిష్కరణలో పాల్గొన్న ప్రచారజాత సభ్యులు



మాచర్ల: బైకు జాతాలో యూటీఎఫ్ నేతలు

పిడుగురాళ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు కోరారు. యూటీఎఫ్ పల్నాడు జిల్లా శాఖ ప్రచారజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆదివారం పిడుగురాళ్లకు చేరుకున్నారు. వారికి పిడుగురాళ్ల శాఖ ఆహ్వానం పలికి స్థానిక యరపతినేనినగర్‌లో ఆ శాఖ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు మందా జాకబ్, ఎం నాగయ్యలచే యూటీఎఫ్ పతాకావిష్కరణ చేయించారు. అనంతరం భారీ ర్యాలీగా కార్యాలయం వద్ద నుంచి కొండమోడు వరకు ప్రచారజాతను తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు, సీనియర్ నాయకులు జి.విజయసారథి, పి.ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు, మండల నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి

మాచర్ల రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఆదివారం పట్టణంలో మహాసభల ప్రచార బైకు జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ విధానాలపై చర్చలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, నాసర్‌రెడ్డి, శ్రీనివాసరావు, నసీర్, ఆదినారాయణ, ఎస్‌వీఎస్ నాగరాజు, గాలీబు, కేఎస్ రాజు, కేశవరెడ్డి, అలీముస్తఫా, చోక్లానాయక్, ఖాదర్‌వలి, రత్నప్రభ, దుర్గాభవాని, అంకమ్మ, జేవీకేఎస్ ప్రసాద్, కిరీటిరెడ్డి, రామారావు, బ్రహ్మం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో సీపీఐది కీలక పాత్ర



పెదకూరపాడులో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెదకూరపాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమం లో సీపీఐ కీలకపాత్ర పోషించిందని అరసం ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్య దర్శి, సీపీఐ జిల్లా నాయకులు కొమ్మాలపాటి శరత్ చంద్రజ్యోతిశ్రీ అన్నారు. పెదకూరపాడులో సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యవర్గ సభ్యులు భైరాపట్నం రామకృష్ణ, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయవరం సబ్‌స్టేషన్‌లో పరిధిలో గల రాయవరం, ముత్యాలంపాడు, కంభంపాడు, గోపాలపురం, మహబూబ్‌నగర్ కాలనీలలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ మాచర్ల రూరల్ ఏఈ వెంకటేశ్వర్లు నాయక్ ఆదివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పాత బ్రేకర్ స్థానంలో నూతన బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పరామర్శ ఆత్మస్థైర్యాన్ని నింపింది

గురజాలటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల దాడిలో గాయపడిన గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించడం ఏపీఎన్జీవో ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిందని ఏపీఎన్జీవోస్ మండల అధ్యక్షుడు ఉన్నం హనుమంతురావు అన్నారు. ఆదివారం ఆయన గురజాలలో మాట్లాడుతూ ఉద్యోగులపై దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. హనుమంతురావు వెంట వేముల శ్రీనివాసరావు, సీహెచ్ అంకమ్మరావు, నాగరాజు, వాసు, లక్ష్మీనారాయణ, వెంకటమణి, స్వప్న తదితరులు ఉన్నారు.

బైకు, కారు ఢీ

● ప్రభుత్వ వైద్యుడు మహేష్‌శర్మకు గాయాలు

వెల్దుర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైకు, కారు ఢీకొన్న సంఘటనలో ప్రభుత్వ వైద్యుడికి గాయాలైన సంఘటన మండలంలోని ఉప్పలపాడు సమీపంలో జరిగింది. మాచర్ల మండలం రైట్‌బ్యాంకు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గంధ్రకోట మహేష్‌శర్మ ఆదివారం కారులో మండలంలోని శిరిగిరిపాడులో ఆంజనేయస్వామిని దర్శించుకొని తిరిగి వస్తున్నారు. కారు ఉప్పలపాడు సమీపంలోకి రాగా వెల్దుర్తికి చెందిన అలవాల శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారు బోల్తా పడగా డాక్టర్ మహేష్‌శర్మకు తీవ్ర గాయాలయ్యాయి. మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా శ్రీనివాసరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చురుకుగా టీడీపీ ఆర్చి పునర్నిర్మాణం

ఆర్చీ మాయమైన రోజే ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు: సుమంత్‌రెడ్డి



చురుకుగా జరుగుతున్న టీడీపీ ఆర్చి నిర్మాణ పనులు

రెంటచింతల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 2019 మే 26న సీఎంగా జగన్‌మోహనరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. టీడీపీ నాయకులు నిర్మించిన ఆర్చిని 2020 జనవరి 6 అర్ధరాత్రి వైసీపీ నాయకులు శపథంచేసి మరీ జేసీబీలతో తొలగించారు. అయినా పోలీసులు మిన్నకుండిపోయారు. ఇదే మండలానికి చెందిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఆర్చిని పునర్నిర్మాణం చేసి ఘనంగా ప్రారంభిస్తామని అప్పట్లో స్పష్టం చేశారు. అన్నట్లుగానే నూతన సంవత్సరం జనవరి 7, 2025 ధ్వంసం చేసిన రోజున ప్రారంభోత్సవం చేసేలా చురుకుగా పనులు జరుగుతున్నాయని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి ఆదివారం చెప్పారు.

నల్లి నివారణకు ఉల్లిగడ్డ కషాయం

పెదకూరపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో నల్లి నివారణకు ఉల్లిగడ్డ కషాయం ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి అభ్యుదయ రైతు దర్శి శేషారావు తెలిపారు. సాగుచేసే పంటలో నల్లి నివారణకు ఉల్లిగడ్డ కషాయాన్ని ఆదివారం ఉపయోగించామన్నారు. ఉల్లి కషాయం తయారీకి ఎక్కువ ఖరీదు కాదని, రైతులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

గురుకులంలో అటకెక్కిన బోధన

● 37 రోజుల నుంచి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల టీచర్ల సమ్మె

రెంటచింతల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పొరుగు సేవల్లో పనిచేస్తున్న టీచర్లు 37 రోజుల నుంచి సమ్మెలోకి వెళ్లడంతో బోధించే వారు కరువయ్యారు. టెన్త్ చదివే విద్యార్థులపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ టెన్త్ చదివే బాలురు 22మంది వుండగా ఇంగ్లీషు, మ్యాథ్స్, సోషల్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు నవంబరు 22 నుంచి విధులకు దూరంగా ఉంటున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల నుంచి సోషల్, సైన్స్‌కు సంబంధించి ముగ్గురు టీచర్లను కేటాయించగా ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. మార్చి 15 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన సబ్జెక్టుల టీచర్లు సమ్మెలో వుండడం చదువుపై తీవ్ర ప్రభావం పడింది. మాచర్ల నియోజకవర్గంలో కారంపూడి 2, విజయపురిసౌత్ 1, రెంటచింతల 1 మొత్తం 4 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. పొరుగు సేవల సిబ్బంది జీతాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించాలని, డీఎస్సీలో మినహాయింపు ఇవ్వాలని, 22 పీఆర్సీ ప్రకారం జీతాలివ్వాలనేది వారి డిమాండ్లుగా వున్నాయి. గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

తాళ్ళచెరువులో ఘనంగా ముగిసిన క్రిస్మస్ స్పోర్ట్స్ కార్నివాల్

అచ్చంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. క్రిస్మస్ స్పోర్ట్స్ కార్నివాల్-6లో భాగంగా ముగిసిన క్రికెట్ పోటీల్లో విన్నర్స్‌గా టీఎల్‌సీ జట్టు నిలిచింది. వెళాంగిని మాత జట్టు రన్నర్‌గా నిలిచారు. మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు గ్రామ బాల ఏసు గుడి పెద్దలు బహుమతులు అందజేశారు. బాడ్మింటన్ చాంపియన్ షిప్ డబుల్స్‌లో నెక్కంటి జోజిరెడ్డి, కాసర్ల సైదారెడ్డి మొదటిస్థానం, గాదె సుధాకరరెడ్డి, పన్నూరి వెంకటరావు ద్వితీయస్థానం పొందారు. సెయింట్ ఆన్స్ స్కూల్ పిల్లలకు జూనియర్ కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాలు పొందిన జట్లకు బహుమతులు అందించారు.

ఎస్సీ కులాల జాబితాను సరిచేసుకోండి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఇన్‌చార్జి రూబెన్

మాచర్లటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లోని వీఆర్వోల వద్ద ఎస్సీ కులాల జాబితా సిద్ధంగా ఉందని, ఎస్సీలు తమ కులం పేరు సక్రమంగా ఉందో లేదో సరిచూసుకోవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల ఇన్‌చార్జి మాచర్ల రూబెన్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా కులం పేరు తప్పుగా ఉంటే వెంటనే సరి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే పనిలో భాగంగా జాబితాను సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో జరుగుమల్ల రాజారావు, మాచర్ల పవన్, బొల్లెద్దుల శివ, హరీష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళంగా 73 బస్తాల ధాన్యం



వెంకటేశ్వరస్వామి ఆలయానికి ధాన్యాన్ని విరాళంగా ఇస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చంద్రాజుపాలెంలో జరిగే శ్రీవెంకటే శ్వరస్వామి కల్యాణమహోత్సవ అన్నదాన కార్యక్రమానికి మండలంలోని చంద్రాజు పాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ ఓర్సు రాములు కుమారుడు పల్నాడు జిల్లా టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ 73 బస్తాల ధాన్యాన్ని విరాళంగా ఆలయకమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్ర మంలో వడ్డెర సంఘం ప్రెసిడెంట్ ఓర్సు లక్ష్మయ్య, సంఘం కమిటీ సభ్యులు బత్తుల శ్రీను, ఓర్సు బ్రహ్మయ్య, లక్ష్మణరావు, ముద్దా చిన మంగయ్య, కొమెర అచ్చయ్య, బ్రహ్మయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓర్సు రాంబాబు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, గాలం నరసింహారావు, కొడవటి దయానందం, తిరుమల అంకాళ్ళు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు ప్రొవైడర్స్ హెల్ప్‌డెస్క్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆదివారం హోం ట్రయాంగిల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సర్వీస్ ప్రొవైడర్స్ హెల్ప్‌డెస్క్‌ను మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్రంగి, విద్యుత్, ప్లంబింగ్, బ్యూటిఫికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల మరమ్మతులు వంటి వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి రాజశేఖర్, సీవోలు పాల్గొన్నారు.

31న హద్దు మీరితే కఠిన చర్యలు...

● ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున

రెంటచింతల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున పలు సూచనలు చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో రహదారులపై వేడుకలు నిర్వహించొద్దన్నారు. మద్యం తాగి, సైలెన్సర్‌లు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, బైక్ రేస్‌లకు పాల్పడిన వారి వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి ఎవరూ బయటకు రావడానికి వీల్లేదన్నారు. డీజే, లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నృత్యాలు చేయవద్దని కోరారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు

● ఎస్‌ఐ సుధీర్‌కుమార్

దుర్గి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని ఎవరైనా మద్యం మత్తులో ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించకూడదన్నారు. రాత్రి వేళ బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కట్ చేయడం, టపాసులు పేల్చడం నిషేధమన్నారు. వాహనాలపై అతివేగంగా వెళ్తూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 29: (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యల్లమంద గ్రామ పర్యటన నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన సోమవారం నాడు జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారులు, పల్నాడు జిల్లా ప్రజలు గమనించవలసిందిగా తెలిపారు.

కోటప్పకొండపైకి రోప్ వే ఏర్పాటుచేస్తాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), డిసెంబరు 29: (ఆంధ్రజ్యోతి) కోటప్పకొండపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనలో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకోనున్న నేపథ్యంలో కోటప్పకొండపై ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ చేసిన కృషిని కొనసాగిస్తామన్నారు. త్వరలో జరగనున్న కోటప్పకొండ తిరునాళ్ళకు ఈ సంవత్సరం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్పైసెస్ పార్కు, కొండవీడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. కొత్తపాలెం, కోట, సొలస, లింగారావుపాలెం, సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, వంకాయలపాడు, కొండవీడు గ్రామాల పరిధిలోని పరిశ్రమలు, గృహ, వాణిజ్య సముదాయాలకు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నేడు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, వివిధ శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ప్రథమ స్థానం

వినుకొండ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ కేసులు పరిష్కారంలో జిల్లాలోని వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచిందని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వర్టికల్ టీవీ, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రభాకర్‌తోపాటు ఎస్ఐలు కత్తి స్వర్ణలత, సత్యనారాయన్, సాయిరెడ్డి, షమీర్‌బాషా, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాలు

వినుకొండ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా యూటీఎఫ్ రాష్ట్ర మహాసభ ప్రచారజాత వినుకొండ పట్టణానికి ఆదివారం చేరింది. ఈ సందర్భగా పట్టణంలోని యూటీఎఫ్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో కేవీఆర్‌అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు గుంటూరు, వినుకొండ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాల మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవంలో 33 మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

● ఈపూరు: ఈపూరు మోడల్ స్కూల్ సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోహన్‌బాబుకు ప్రతిభా పురస్కార అవార్డును ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కొత్తలూరు (శావల్యాపురం) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ డాబా పైనుంచి కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మరణించిన సంఘటన మండలంలోని కొత్తలూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొత్తలూరుకు చెందిన వడ్లమూడి సుబ్బారావు (50) ఈ నెల 25వ తేదీన తన ఇంటి డాబా పైనుంచి ప్రమాదవశాత్తూ ఇంటి ఆవరణలోని గచ్చుపై పడ్డాడు. దాంతో ఆయన తలకు, నడుముకు తీవ్రగాయాలు కాగా వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తరువాత నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సరావుపేటలో చికిత్స పొందుతున్న సుబ్బారావు శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం కొత్తలూరులో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ ఖాతాలో నగదు అపహరణ

కారుమంచి (శావల్యాపురం) డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఖాతాకు ఆరోగ్యశ్రీ నగదు జమ చేస్తామని వ్యక్తిని నమ్మించి ఫోన్‌కు లింక్ పంపించి బ్యాంక్ ఖాతాలోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన మండలంలోని కారుమంచిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గుడిపాటి నరసింహారావు తన కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో చేర్పించి ఆపరేషన్ చేయించేందుకు ఆరోగ్యశ్రీకి దరకాస్తు చేశాడు. విషయాన్ని తెలుసుకున్న సైబర్ నేరగాళ్ళు ఆదివారం మధ్యాహ్న సమయంలో నరసింహారావుకు ఫోన్ చేసి ఆరోగ్యశ్రీ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఆపరేషన్ చేశాక పోషణ ఖర్చులకు నగదు జమ చేస్తామని పోస్టల్ ఖాతా అయితే నగదు త్వరగా పడుతుందని నమ్మించారు. ఆరోగ్యశ్రీ ద్వారా నగదు జమచేయాలంటే బ్యాంక్ ఖాతాలో మినిమం బ్యాలెన్స్ ఉండాలని చెప్పి ఫోన్‌కు లింక్ పంపించారు. దాన్ని నొక్కితే ఇతర ఖాతాల నుంచి పోస్టల్ ఖాతాకు సులువుగా మినియం బ్యాలెన్స్ జమ చేసుకోవచ్చన్నారు. నరసింహారావు లింక్ నొక్కగానే బ్యాంక్ ఖాతాలోని రూ.49,670 రెండుసార్లుగా డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. అనంతరం శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వల్లభేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు

రొంపిచర్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతి సమేత వల్లభేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు ఆదివారం జరిగాయి. అర్చకులు చందలూరి పరమేశ్వరరావు పంచామృతాభిషేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వర స్వామి

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి



ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 29: పల్నాడు జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ, 31వ తేదీ రాత్రి సమయంలో నిబంధనల పాటించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలుకు సంబంధించి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు/మ్యూజిక్, సిస్టంలు ఉపయోగించేందుకు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు. న్యూస్ పేపర్లు, మాగజైన్స్, హోర్డింగ్‌లలో అశ్లీల పోస్టర్లు గాని, ప్రకటనలు ఉండరాదన్నారు. వేడుకలలో అశ్లీల నృత్యాలు అనుమతించమన్నారు. అధికారుల నుంచి అనుమతి లేనిదే లిక్కరు అమ్మటం నిషిద్ధం అన్నారు. వేడుకల్లో టపాసులు నిషేధం అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించటం, పేకాట ఆడుట నిషిధం అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, మితిమీరి వేగంగా వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అన్ని కూడళ్ళలో మద్యంపై బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేసి మద్యం సేవించి వాహనాలు నడిపు వారికి జరిమానాలు విధిస్తామన్నారు. వీడియో కెమేరాలు, డిజిటల్ కెమేరాలు ఉపయోగించి అతిగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతిపొందిన బార్లు, క్లబ్‌లు ఇతర హోటల్‌లలో నిర్ణీత సమయం దాటి తెరచి ఉంచితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. .అన్ని ప్రాంతలలో పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మహిళలు ఒంటరిగా, జనావాసాలు లేని ప్రదేశాలకు వెళ్ళవద్దన్నారు.

గౌతు లచ్చన్న చిత్ర పటానికి పాలాభిషేకం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న విగ్రహం కార్యక్రమాన్ని అవమానించడం అంటే బీసీ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయమేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యామా మురళి అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పాలాభిషేకం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఏలూరు జిల్లా నూజివీడులో ఈ నెల 15న బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కొందరు సోషల్ మీడియాలో వివాదం చేసి, అవమానపరిచినందుకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యామా మురళి మాట్లాడుతూ గౌతు లచ్చన్న తాడిత, పీడీత వర్గాలకు మార్గదర్శకుడన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, విశవేశ్వరరావు, యారగని నరసింహరావు, కేశని సుబ్బయ్య, దాసరి కోటేశ్వరరావు, పేరం రామకృష్ణ, దాసరి శ్రీనివాస్, గూండ్ల గోవింద్ గౌడ్, దొంతా రాజేష్, మోర్ల రమేష్, దాసరి వాసు, కోదండం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు మూడు కిలోల వెండి కానుక

వన్‌టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతం వినుకొండకు చెందిన ఎం.వి.ఫణీంద్ర ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దుర్గామల్లేశ్వర దేవస్థానానికి మూడు కిలోల 5 వెండి కడ్డీలను ఆలయ ఈవో కె.ఎస్.రామరావుకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ ఈవో చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



వెండి కడ్డీలను అందజేస్తున్న ఫణీంద్ర కుటుంబ సభ్యులు

బాలోత్సవంలో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

శావల్యాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం పోటీల్లో వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు, శావల్యాపురంలోని శ్రీరామ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరచి జిల్లాస్థాయిలో ఉత్తమ బహుమతులు సాధించినట్లు పాఠశాలల నిర్వాహకులు ఆదివారం తెలిపారు. శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో నర్సరావుపేటలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల్లో నిర్వహించిన రెండో పల్నాడు బాలోత్సవం పోటీల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై జరిగిన పోస్టర్ ప్రెజంటేషన్‌లో పాఠశాలకు చెందిన 7వతరగతి విద్యార్థి కార్తీక్ ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలువగా, అదే విభాగంలో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి యశ్విన్ కన్సోలేషన్ బహుమతి సాధించారన్నారు. బాలోత్సవంలో వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొత్తం 11 విభాగాల్లో పాల్గొని 7 విభాగాల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు తెలిపారు. క్విజ్‌లో వివేక్, జశ్వంత్, నాగరోషిణి గ్రూప్ ప్రథమ స్థానాన్ని, మ్యాప్ పాయింటింగ్‌లో నాగరోషిణి ద్వితీయ స్థానాన్ని, జశ్వంత్ కన్సోలేషన్ బహుమతిని, వ్యాసరచనలో నాగరోషిణి మూడో స్థానాన్ని, సీనియర్స్ లఘు నాటికలో సాయికృష్ణ టీం సభ్యులు మూడోస్థానాన్ని సాధించినట్లు తెలిపారు. కోలాటంలో తులసి టీం సభ్యులు ప్రోత్సాహక బహుమతిని, జానపద నృత్యంలో హేమ టీం సభ్యులు పోత్సాహక బహుమతులు సాధించినట్లు తెలిపారు.

ఎన్నెస్పీ కాల్వ కట్టలపై పిచ్చికంప తొలగింపు

ఈపూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ కాలువ కట్టలపై పిచ్చికంప తొలగింపు చర్యలను అధికారులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నెస్పీ కాలువల నిర్వహణలో నిర్లక్షంగా వ్యవహరించింది. దాంతో కాలువ కట్టలపై పిచ్చికంప అల్లుకుపోయి చిట్టడవిని తలపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల బాధను గుర్తించి కాలువ కట్టలపై కంప చెట్లను తొలగించే చర్యలను చేపట్టారు. కాలువ ఎడమ కట్టపై 60మైలు నుంచి 85 మైలు వరకు చెట్లు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 69 మైలు వద్ద కంప చెట్లు తొలగిస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● ప్రత్తిపాటికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి

చిలకలూరిపేట డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి బి.హైమారావుల ఆధ్వర్యంలో సంఘం కార్యవర్గ సభ్యులు ఆదివారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాస గృహంలో కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్తిపాటి సహకారాన్ని వారు కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయిందని, ఉద్యోగులకు వెంటనే డీఏ ప్రకటించాలని, వీలైనంత త్వరగా నూతన పీఆర్సీ కమిటీని వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలని వారు కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా వారికి తెలిపారు. ప్రత్తిపాటిని కలిసిన వారిలో సంఘం నాయకులు బీవీ నాగేశ్వరరావు, కోనూరి సాంబశివరావు, కొమ్మనబోయిన సుధాకర్, కూరపాటి రాజా మాష్టారు, షేక్ హనీఫ్ దౌలా ఉన్నారు.

జీవీ, మక్కెనపై వ్యక్తిగత విమర్శలు తగదు

● టీడీపీ నాయకులు

వినుకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును వ్యక్తిగతంగా విమర్శించడం తగదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లగడపాటి వెంకటరావు మాట్లాడుతూ బెల్లుషాపులపై వారు మాట్లాడిన తీరును పరిశీలిస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. పెమ్మసాని నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థాయిని బట్టి నాయకులను విమర్శిస్తే మంచిదని, నిత్యం ప్రజలకోసం పోరాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వ్యక్తులపై ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. న్యాయవాది రామకోటేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పీవీ సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గోవింద రాజులు, టీడీపీ ఈపూరు మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, నూజండ్ల మాజీ ఎంపీపీ నంబుల గురున్నాథం, ఎలిశెట్టి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్మాయ వల్లే విద్యుత్ చార్జీల భారం

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారం గత వైసీపీ ప్రభుత్వ జగన్మాయ అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండగా వరసగా ఐదేళ్ల పాటు చార్జీల పెంపు అనే పదం వాడకుండా ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో బిల్లుల మోత మోగించారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచి మోత మొదలుపెట్టారన్నారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ప్రతిపాదనల పరంపర గత వైసీపీ జగన్ సర్కార్ ఐదేళ్ళ పాలనలో కొనసాగిందన్నారు. జగన్ పాలనలో చివరి ఏడాది ఏకంగా రూ.12,849 కోట్లు బాదుడుకు సిద్ధమయ్యారని వివరించారు. దీనిపైనా ఈఆర్సీ తన నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఎన్నికలు ముగిసి, కూటమి సర్కార్ వచ్చాక 2022-23లో రూ.6702, 2023-24లో రూ.9400కోట్ల వసూలుకు ఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. జగన్ పాలనలో ఆఖరి ఏడాది వినియోగదారులకు తెలియకుండా యూనిట్‌కు 40పైసలు చొప్పున ట్రూ అప్ చార్జీల భారాన్ని వేశారని చెప్పారు. పీపీఏలను రద్దుచేసి విద్యుత్ వాడకుండానే హైకోర్టు ఆదేశాల మేరకు రూ.8000 కోట్లను చెల్లించాల్సి వచ్చిందని, ఆ భారాన్ని అంతా ప్రజల పైనే వేశారని మండిపడ్డారు.

ఎమ్మెల్యేను కలిసిన అదనపు జిల్లా కోర్టు ఏజీపీ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 29: స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు అదనపు గవర్నమెంట్ లీడర్‌గా ఇటీవల నియమితులైన సీనియర్ న్యాయవాది కే సీతారావరాంజనేయులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును కలిశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పార్టీ నేతలకు ఏజీపీ సీతారామాంజనేయులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాదులు దేశిరెడ్డి మల్లారెడ్డి, దేశ్ రెడ్డి చిన్నపరెడ్డి, దాసరి ఉదయశ్రీ, పాశం కోటి నాగయ్య, చెన్నుపాటి నాగేశ్వరరావు, గుండాల సురేష్‌బాబు, పి.చక్రపాణి, బి.గోపిరాజు ఉన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అదనపు జిల్లా కోర్టు ఏజీపీ సీతారామాంజనేయులు

శ్రీదత్త వైద్యశాల నిర్వాహకులకు పురస్కారాలు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 29, పట్టణానికి చెందిన శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి దంపతులకు అరుదైన ఐకాన్స్ ఆఫ్ హెల్త్ కేర్ పురస్కారాలు లభించినట్లు వైద్యశాల నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా వైద్యరంగంలో వివిధ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నందుకుగాను వారికి ఈ పురస్కారాలు లభించాయి. శనివారం విజయవాడలో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ డాక్టర్ కృష్ణకాంత్ దంపతులకు విడివిడిగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ దంపతులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.



పురస్కారాలు అందుకున్న కృష్ణకాంత్, జ్ఞానేశ్వరి

ఎన్నెస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ఈపూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువలో గుర్తుతెలియని మృతదేహం ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆదివారం ఉదయం 11గంటలకు ఊడిజర్ల సమీపంలో బ్రిడ్జి వద్ద కంపచెట్ల వద్ద కొద్దిసేపు నిలిచి, మళ్లీ నీటిలో కొట్టుకుపోయింది. సుమారు 30-35సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి శరీరంపై బనియన్, బులుగు చొక్కా, డ్రాయర్ ఉన్నాయి.